ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల జిల్లా వార్తలు

5

బుధవారం 9 ఏప్రిల్ 2025



అటవీ శాఖ బెదిరింపులు మానుకోవాలి

జన్నారం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం ప్రధాన రహదారి గుండా వెళ్లే వాహనదారులను అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని, ఇవి మానుకోవాలని ఎన్‌జీవో నాయకుడు భూమాచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు టైగర్‌జోన్ పేరుతో ఆంక్షలు విధిస్తూ మండల అభివృద్ధికి అడ్డు పడుతున్నారని, వాహనదారులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అటవీశాఖ అధికారులు స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నడుచుకోవాలన్నారు. నాయకులు తిరుపతి, రాజు పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేయండి

నస్పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ, బీసీలల్లో రాజకీయ చైతన్యం తీసుకురావాలన్న సంకల్పంతో ఈ నెల 14న ఆదిలాబాద్ నుంచి లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్ర ప్రారంభం అవుతుందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏదునూరి రమేష్ అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో మాట్లాడారు. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ అంతటా మూడూ సంవత్సరాల మూడ మాసాల పాటు ఈ యాత్ర కొనసా గుతుందన్నారు. ఈ సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు రేగుంట రాకేష్, రామస్వామి పాల్గొన్నారు.

భీమారం మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టులో అడుగంటిన నీరు



అడుగంటుతున్న గొల్లవాగు..

- ప్రాజెక్టు నీటి సామర్థ్యం 0.5 టీఎంసీలు...
- ప్రస్తుతం తగ్గిన నీటి మట్టం
- ఆందోళనలో రైతులు

భీమారం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండలం పూర్తిగా వ్యవసాయ ఆధారిత మండలం. 80శాతం మంది రైతులు వరిపంటను పండిస్తున్నారు. 20శాతం మంది రైతులు పత్తి పంటను సాగుచేస్తున్నారు. ఎండలు తీవ్రత పెరగడంతో భీమారం మండలకేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టులోని నీరు రోజురోజుకూ అడుగంటిపోతోంది. రైతుల పంట పొలాలు పొట్టదశకు చేరుకున్నాయి. ఇంకా 45రో జులు నీరు పంట పొలాలకు అందితే కానీ పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదు. గొల్లవాగు ప్రాజెక్టును 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 83 కోట్లతో నిర్మించింది. ప్రాజెక్టు నీటి సామర్థ్య విస్తీర్ణం వెయ్యి ఎకరాలు కేటాయించగా ప్రాజెక్టుకు ప్రధాన కాలువతో పాటు 39 డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉన్నాయి. ప్రధాన కాలువ పూర్తి పొడవు 26 కిలోమీటర్లు ఉంటుంది. భీమారం మండలంతో పాటు చెన్నూరు మండలంలోని గంగారాం, ఓత్కుల పల్లి, ఆస్నాద, అంగ్రాజ్‌పల్లి, దుగ్నేపల్లి, చెల్లయ్యపేట, రాజపేట, కొమ్మెర ఎర్రగుంటపల్లి తదితర గ్రామాలకు నీటిని అందించాలని ప్రాజెక్టును నిర్మించారు. వర్షాకా లంలో ఆయకట్టు మొత్తం విస్తీర్ణం 9,500 ఎకరాలు కాగా వేసవి కాలంలో 7వేల ఎకరాలకు మాత్రమే సాగు నీరందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్న భీమారం శివారులోని రైతులు పూర్తిగా ప్రాజెక్టు మీదనే ఆధారపడి పంటలను సాగు చేస్తుంటారు. ఈ సంవత్సరం ఇంకా 45 రోజులు నీరందితే తప్ప పంటలు చేతికొచ్చే అవకాశాలు కానరావడం లేదు.

● ప్రాజెక్టులో తగ్గుతున్న నీరు

గత సంవత్సరం తక్కువ వర్షాల కారణంగా అలాగే పైన ఉన్న గొల్లవాగుకు ఖాజీపల్లి గ్రామంలో పెద్దవాగు ప్రాజెక్టు నిర్మించడంతో నీరంతా అక్కడే నిలవడంతో వచ్చే కొద్ది నీరు గొల్లవాగు ప్రాజెక్టులో చేరింది. గొల్ల వాగు ప్రాజెక్టు భీమారం మండలం నుంచి చెన్నూరు మండలం వరకు రైతుల పొలాలకు నీరందిస్తుంది. చెన్నూరు మండలం, భీమారం మండలంలోని కొత్త పల్లి, మద్దికల్, ఎల్కేశ్వరం గ్రామాల్లో పంటలు ప్రస్తు తం పాలు పోసుకునే దశలో ఉంది. భీమారం రైతులు పూర్తిగా గొల్లవాగు ప్రాజెక్టుమీద ఆధారపడి ఉండడం తో ప్రాజెక్టు నీరును జనవరిలో వదలగా ఫిబ్రవరి చివరి నాటికి రైతులు నాట్లు పెట్టుకున్నారు. వరి పంట పొట్టదశలో ఉండగా ప్రాజెక్టునీరు అడుగంటి పోతుండటం ఇబ్బందికరంగా మారింది. ఇంకా 45 రోజులు నీరు వస్తేనే పంట చేతికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కానీ రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుండడం నీటి మట్టం తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. ప్రాజెక్టులో..

(తరువాయి 7లో)

బీసీ నాయకుల నిరసన దీక్ష



గాంధీ పార్కులో నిరసన దీక్ష చేస్తున్న బీసీ సంఘం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో మంగళవారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షను బీసీ నాయకుడు డాక్టర్ రఘునందన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని 8 రోజులుగా బీసీ ఉద్యమ కారుడు, బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా నిరసన దీక్ష చేపట్టామన్నారు. ఈ దీక్షకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డాక్టర్ నీల కంటేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు కర్రె లచ్చన్న, రాజ్‌కిరణ్, సురేంద్ర చారి అంజయ్య, రమేష్ సంఘీభావం తెలిపారు. దీక్షలో నాయకులు శ్రీనివాస్, భాస్కర్, గణేష్, మల్లేష్, రాజేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



నస్పూర్ కాలనీలో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

నస్పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని నస్పూర్ కాలనీ, గోదావరి కాలనీ, నాగార్జున కాలనీ, న్యూ నాగార్జున కాలనీ (13, 23, 24, 25 వార్డులు)ల్లో మంగళవారం జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని వివరిస్తూ కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి నూకల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మాజీ వైస్ చైర్మన్ సల్లా మహేష్, నాయకులు సంపత్ రెడ్డిలతో పాటు వివిధ వార్డులకు చెందిన మాజీ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నామని మందమర్రి మున్సిపల్ కమీషనర్ రాజలింగు తెలిపారు. మంగళ వారం పట్టణంలోని 19వవార్డులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న పిచ్చి మొక్కలు, చెదారాన్ని తొలగించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాంగ్రెస్ నాయకులు చెత్తా చెదారం నిల్వ ఉందని తమ దృష్టికి తీసుకువచ్చారని, ఎమ్మెల్యే కూడా వార్డుల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పడంతో ప్రత్యేక పారి శుధ్య పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సొత్కు సుదర్శన్, ఉపేందర్‌గౌడ్, ఆకారం రమేష్, రమేష్, మాయ రమేష్, సురేష్, పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

చెన్నూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు అంబేద్కర్ ఉత్సవ కమిటీని మంగళవారం చెన్నూరులో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తగరం చిరంజీవి, ఉపాధ్యక్షులుగా బోగె భారతి, సంపత్, అశోక్, మల్లేష్, శ్రీకాంత్, భవానీ, జనరల్ సెక్రటరీగా తగరం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీధర్, ప్రశాంత్, జాయింట్ సెక్రటరీలుగా పర్వతాలు, మల్లేష్, కోశాధికారిగా రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ నెల 14న జరిగే అంబేద్కర్ జయంతిలో ప్రజలు, కార్మికులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లబ్ధిదారుడి ఇంట్లో అధికారుల భోజనం

మందమర్రిటౌన్/రూరల్ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 1వ జోన్‌లో పొన్నగంటి సుగుణనివాసంలో మంగళవారం మందమర్రి తహసీల్దార్ సత్యనారాయణ, సిబ్బంది ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో వండిన భోజనాన్ని రుచి చూశారు. తహసీల్దార్ మాట్లాడుతూ సన్నబియ్యం పథకంతో ప్రజలందరు సంతోషంగా ఉన్నారని, రేషన్ బియ్యం అక్రమ దందా తగ్గిందన్నారు. మార్కెట్‌లో రూ. 50నుంచి 60 విలువ ఉన్న బియ్యాన్ని తెల్లరేషన్ కార్డుదారులు ఉచితంగా పొందుతున్నారని పేర్కొన్నారు. రేషన్ డీలర్లు సకాలంలో ప్రజలకు పంపిణీ చేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు సన్నబియ్యం పంపిణీ చేయకపోతే తనకు ఫిర్యాదు చేయాలన్నారు.



లబ్ధిదారుడి ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

అట్టడుగువర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేయాలి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించాలి
- సమీక్షా సమావేశంలో ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్



ప్రసంగిస్తున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్

జ్యోతినగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎస్సీ కమిషన్ జాతీయసభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీ నియంలో హాలులో పెద్దపల్లి, మంచిర్యాల కలె క్టర్లు కోయ శ్రీహర్ష, కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ, డీసీపీ భాస్కర్, ఎస్సీ కమిషన్ జాతీయ సలహాదారులు సునీల్ బాబు, రీసెర్చ్ అధికారి డి.వరప్రసాద్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఎస్సీ వర్గాలకు అమలవుతున్న సంక్షేమ పథ కాలు, ప్రభుత్వ కార్యక్రమాల గురించి కలెక్టర్లు వివరించారు. గతంలో ఎస్సీ కమిషన్ సభ్యుడి ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో జారీ చేసిన ఆదేశాలు, సూచనల అమలు, పనుల పురోగతిని అధికారులు వివ రించారు. ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులను పక్కాగా నమోదు చే యాలని, నిందితులకు కచ్చితంగా శిక్ష పడేలా సాక్ష్యాలను సేకరించాలన్నారు. అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అందిన ఫిర్యాదులకు తక్షణం ఎఫ్ఐఆర్ న మోదు చేసి కేసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయాలని ఆ దేశించారు. బెల్లంపల్లిలో ఉన్న ఇండస్ట్రియల్ పార్కులో ఎస్సీ ఔత్సా హిక పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించాలని సూచించారు.

దళితుల భూములను ఆక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించాలని, ఆక్రమణదారుపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పకుండా పాటించాలన్నారు. రెండు జిల్లాల్లోని ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులు, కారుణ్య నియామకాలు, పదోన్నతుల పెండింగ్ లిస్టు అందజేయాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన

జైపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగిపెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గంగిపెల్లి గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి 110 మంది ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. లబ్దిదారులు తప్పకుండా ఇండ్లను నిర్మించుకుని నూతన ఇండ్లలో ఉండాలని సూచించారు. ఇంటినిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిర్మించుకుంటేనే ఇండ్ల నిర్మాణ బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



పశువుల దాహార్తి తీరే దారేదీ?

- ఎండలతో అడుగంటిన చెరువులు, వాగులు
- ఇబ్బందులు పడుతున్న పోషకులు

6

ఇంటర్ తర్వాత ఎటు..?

- కోర్సుల ఎంపికే కీలకం
- మూడు, నాలుగేళ్లు కష్టపడితే.. జీవితం ఆనందమయం

7

పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ఐసీడీఎస్ సీడీపీవో రేష్మా



అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మమత

లక్సెట్టిపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పుట్టిన పిల్లలపై తల్లులు వెయ్యిరోజుల పాటు ప్రత్యేక దృష్టి పెట్టాలని మాతా శిశు సంక్షేమశాఖ అధికారిణి రేష్మా అన్నారు. పట్టణంలోని వీకర్ సెక్షన్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళ వారం ఆమె పోషకపక్షం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ తల్లి గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చి రెండేళ్లు నిండే వరకు గడిచే దశ బిడ్డ భవిశ్యత్తును నిర్ణయిస్తుం దన్నారు. బిడ్డ జీవితంలో మొదటి వెయ్యి రోజులే జీవితకాల ఆరోగ్యానికి అభివృద్ధి ఉంటుందన్నారు. ఆ వెయ్యి రోజుల్లో బరువు, ఎత్తు అత్యంత వేగంగా పెరుగుతా రని తెలిపారు. పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పించడం కోసమే పోషకపక్షం కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని 15 రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్లు శంకరమ్మ, రాధికతో పాటు పిల్లలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

జన్నారం : జన్నారం 2 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ పద్మ గర్భిణులు, బాలింతలు తీసు కోవాల్సిన పోషకహారం, ముర్రుపాల ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, సునీత, పార్వతి, ఆశాకార్యకర్త అంజుమ్ భాను, గర్భిణులు పాల్గొన్నారు.

దండేపల్లి: పోషకారంతోనే సంపూర్ణ ఆరో గ్యంగా ఉంటారని ఐసీడీ ఎస్ గూడెం సెక్టార్ సూపర్‌వైజర్ల జాడి వెంక టలక్ష్మి అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా దండేపల్లి మండలం వెల్గనూర్ అంగన్ వాడీ కేంద్రంలో పోషకా హారంపై మంగళవారం పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అంగడి వాడి పిల్లలకి అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 22 వరకు పోషనపక్షం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎ ఎన్ఎం పద్మ, అంగన్‌వాడి టీచర్లు శైలాజ, లక్ష్మి, ఆశ పద్మ గర్భిణి, బాలింతలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు
పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మోతీలాల్

- జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

లక్సెట్టిపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న వరిధాన్యం కొనుగోలుకేంద్రాలను నిర్వాహకులు పక డ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల కేంద్రం నిర్వాహకులకు అదే విదంగా సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు యాసంగిలో సాగు చేసిన వరిధాన్యంను సన్నరకం దొడ్డురకం వేరు వేరుగా కొనుగోలు చేయాలని సూచించారు. ఏగ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం మద్దతుధర రూ.2320 అదేవిధంగా సాధారణరకం ధాన్యానికి రూ.2300 నిర్ణయించారు. ము ఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో మంచినీటి సౌకర్యంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. అంతే కాకుండా తూకం వేసేందుకు ఖాంటా బాట్లు, మాయిశ్చర్ మిషన్, ప్యాడీ మీటర్స్, డిజిటల్ మెట్రోమీటర్స్, గన్నీ సంచులు అందు బాటులో ఉంచుకోవాలని సూచించారు. అకాల వర్షలు సంభవించే అవకాశం ఉంటుందని కేంద్రంలో టార్పాలిన్ కవర్లు అందు బాటులో ఉంచుకోవాలని కనీసం ఒక్కో కేంద్రంలో 25టార్పాలిన్ కవర్లు ముందుగానే ఉంచుకునే విదంగా జాగ్రత్త పడాలన్నారు. కేంద్రాలకు ఇచ్చిన గన్ని సంచుల వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమో దు చేసుకోవాలన్నారు. రైతులకు కేంద్రాల వద్ద ఏలాంటి ఇబ్బంది తలెత్తకుండా కేంద్రా ల్లో ఏలాంటి అవకతవకలు రాకుండా జా గ్రత్త పడాలన్నారు. డీసీఎస్‌వో బ్రహ్మా రావు, డీఆర్‌డీవో కిషన్, డీసీ ఎస్ఎం శ్రీకల, లక్సెట్టిపేట తహసీల్దార్ దిలీప్‌కుమార్‌తో పాటు కేంద్రం నిర్వహకులు, రవాణ, మార్కెటింగ్, సెర్ప్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

● వివిధ పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికే కార్యాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్వో దిలీప్ కుమార్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పట్టణ వ్యాపారి చింతల శ్రీనివాస్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పడవల యజమానులతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేందర్

కోటపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సంఘ విద్రోహ శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెన్నూర్ రూరల్‌సీఐ సుధాకర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్ సూచించారు. మంగళవారం తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన వెంచపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ముందుగా ప్రాణహిత నదితీరాన్ని సందర్శించి పడవలు నడిపే యాజమానులు, మత్స్యకారులతో మాట్లాడారు. సరిహద్దులో ఎవరైనా అనుమానన స్పదంగా సంచరించినా, కదలికల్లో తేడా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సరిహద్దు గుండా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులతో మాట్లాడి వారి వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలందరు సహకరించాలని, సీసీకెమెరాల ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. సైబర్‌మోసాలు జరుగుతున్న తీరును వివరించి, సైబర్‌నేరాల నియంత్రణ చర్యలను వివరించారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణకు సహకరించాలని, గ్రామాల్లో మత్తుపదార్థాలు విక్రయాలు జరిగినా, సేవించినా పోలీసులకు తెలియజేయాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ప్రతివాహనదారుడు వాహనానికి సంబం ధించిన అన్నిధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు

చంద్రశేఖర్, ఏపీఎం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మహిళలకు బ్యాంకే లింకేజీ రుణాలు అందించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఏపీఎం: మండలంలో 217 సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.12.10 కోట్ల రు ణాలు ఇచ్చాం. 2024-25 ఆర్థిక సంవత్సరం లక్ష్యానికి చేరుకున్నాం. తరుచుగా సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని ఎస్‌హెచ్‌జీలు ఉన్నాయి?

ఏపీఎం: మండలంలో 531 స్వయం సహాయక సంఘాలున్నాయి. అందులో 5,650 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: వడ్డీ లేని రుణాలు ఎటువంటి సంఘాల ఖాతాల్లో జమవుతాయి?

ఏపీఎం: బ్యాంకు నుంచి తీసుకు రుణాలు సక్రమంగా చెల్లించి అసలు, వడ్డీ సక్రమంగా చెల్లిస్తేనే నేరుగా బ్యాంకుల నుంచి వడ్డీ జమ అవుతుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 307 సంఘాల ఖాతాల్లో రూ.36,98,630 జమ అవుతాయి.

- దహెగాం, ఆంధ్రజ్యోతి

రంగనాయక ఆలయ అభివృద్ధికి కృషి

బెజ్జూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలోని రంగనాయక ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ సాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ దండె విఠల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు మహేష్, జగ్గాగౌడ్, శ్రీవర్ధన్, రాణా ప్రతాప్, మహేష్, పెంటయ్య, సుధా కర్‌గౌడ్, రాజన్న, సురేష్‌గౌడ్, శ్రీనివాస్, పెంటయ్య, విశ్వేశ్వర్‌రావు, నహిర్ అలీ, బాపురావు పాల్గొన్నారు.



చుక్కనీరు లేని ఎల్కపల్లి వాగు

పశువుల దాహార్తి తీరే దారేదీ?

● ఎండలకు అడుగంటిన చెరువులు, వాగులు ● ఇబ్బందులు పడుతున్న పోషకులు

బెజ్జూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండి పోతుండడంతో చెరువులు, వాగులు అడుగంటి పోతున్నాయి. గ్రామాల్లో ప్రజలకు మిషన్ భగీరథ, కులాయి ద్వారా నీరు అందుతోంది. కానీ చెరువులు, వాగులపైన ఆధారపడే మూగజీవాలు తాగునీటికి అల్లాడుతున్నాయి. జిల్లాలో ఆవులు 2,93,845, గేదెలు 46,374, గొర్రెలు 1,59,349, మేకలు 2,56,854 ఉన్నాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పశువులను యజమానులు మేతకు విడిచిపెడుతున్నారు. ఇలా బయట సంచరించే పశువులకు తాగునీరు దొరకక అల్లాడుతున్నాయి. ఎక్కువగా పశువులు మేతకు వెళ్లిన సమయంలో సమీపంలోని వాగులు, చెరువుల్లో దాహార్తి తీర్చుకుంటాయి. కానీ ఎండల కారణంగా చెరువులు, వాగుల్లో చుక్క నీరు లేకపోవడంతో పశువుల దాహార్తి తీరడం లేదు.

ధ్వంసమైన నీటి తొట్టెలు..

వేసవిలో పశువుల దాహార్తి తీర్చడానికి గతంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన నీటి తొట్టెలను పట్టించుకోక పోవడంతో ధ్వంసమయ్యాయి. ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 500 నీటి తొట్లను నిర్మించారు. తొట్ల నిండా నీరు నింపడంతో ఉదయం, సాయంత్రం పశువులు, గొర్రెలు, మేకలు తమ దాహార్తిని తీర్చుకునేవి. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో నీటి తొట్ల జాడే లేదు. మరికొన్ని చోట్ల నిర్వహణను గాలికొదిలేయడంతో ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల రోడ్డు విస్తరణ పనుల కారణంగా పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఓ వైపు చెరువులు, వాగుల్లో నీరు అడుగంటి పోయి, మరో వైపు నీటి తొట్టిలు లేకపోవడంతో పశువుల దాహార్తికి యజమానులు అవస్థలు పడుతున్నారు. ఎండల తీవ్రత పెరిగిన కారణంగా వాగులు, చెరువులు పూర్తిగా ఎండిపోయాయి.

ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులను యజమానులు మేతకు విడిచిపెడుతున్నారు. పంట చేలల్లో ప్రాంతాల్లో మేతకు వెళ్లిన పశువులు ఇళ్లకు చేరితేనే దాహార్తి తీరే పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో అటవీ ప్రాంతం నుంచి వచ్చే ఊట నీటిని వాగులకు మళ్లించకుండా పంటల సాగుకు వినియోగిస్తున్నారు. జిల్లాలో పెద్దగా సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడం ఉన్న చెరువుల్లో చుక్కనీరు లేని కారణంగా పశువులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయి. స్థానిక అధికారులు ఆయా గ్రామాల్లో ఉన్న నీటి తొట్లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పశు పోషకులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జైపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మహిళ మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన నడిగొట్టు సంధ్యారాణి (40) కుటుంబీకులతో కలిసి మంచిర్యాలలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చింది, కారులో తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద జైపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న వాహనం కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన సంధ్యారాణిని మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. సంధ్యారాణి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అడవి జంతువుల మాంసం పట్టివేత

భీమారం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు అటవీ రేంజ్ పరిధిలోని భీమారం మండలంలోని నర్సింగాపూర్‌లో అటవీ అధికారులు కొండ గొర్రెల మాంసాన్ని స్వాధీన పర్చుకుని పలువురిని అరెస్టు చేసినట్లు ఆలస్యంగా తెలిసింది. నర్సింగాపూర్ అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి వేటగాళ్లు నర్సింగాపూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి కొండె గొర్రెలను వేటాడినట్లు తెలిసింది. రెండు కొండ గొర్రెలను వేటాడిన నిందితులు గ్రామంలో విక్రయించేందుకు పోగులు వేస్తుండగా అటవీ శాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు సమాచారం. వేటగాళ్ల వద్ద లభించిన మాంసంతో పాటు పలువురుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈవిషయాన్ని చెన్నూరు అటవీ రేంజ్ ఆఫీసర్ శివకుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా జంతువుల మాంసం పట్టుకున్నది వాస్తవమేనని తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

దండేపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్‌కు చెందిన మేక రాజేష్ 2023లో పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను గుర్తించి మంగళవారం బాధితుడికి ఎస్సై ఎండి తహసినోద్దీన్ అందజేశారు. బాధితుడు దండేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పో లీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి మొబైల్ ఫోన్ అందజేశారు.



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై

ఎస్సై మాట్లాడుతూ ఎవరైన ఫోన్ పోగొట్టుకుంటే ఫోన్ వివరాలు వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ద్వారా తెలియజేస్తే, సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకొని ఈ పోర్టల్ ద్వారా మొబైల్ తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ సేవలను అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి'

జన్నారం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ కక్ష సాధింపులు మానుకోవాలని మాజీ ఎంపీటీసీ రియాజుద్దీన్ అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న తనకు సంబంధించిన ఇసుక ట్రాక్టర్‌ను అటవీ శాఖ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారని, అనంతరం గొడవ పడకుండా ఉండాలని రాజీ పత్రాలను రాసుకున్న తర్వాత తెరపైకి కావాలని అటవీ శాఖ అధికారులు మళ్లీ ఫిర్యాదులు చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నా రన్నారు. కవ్వాల టైగర్ రిజర్వులో అటవీ శాఖ అధికారులు అవలం బిస్తున్న వ్యతిరేక కార్యకలపాలకు ధీటుగా పోరాడుతున్న వ్యక్తుల్లో తాను ఒక్కడినని, అందుకే కావాలని అధికారులు అక్రమకేసులు పె డుతూ తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అటవీ ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య రానీయొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లాలోని 15 మండలాల ఎంపీడీవో, ఎంపీవోలు, కార్యదర్శులు, మిషన్ భగీరథ ఇంజనీర్లు, ఉపాధి హామీ సిబ్బందితో తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ పథకం పనుల విషయంపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారు మూల గ్రామాలకు తాగునటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అందించాల న్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటి అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్ మోటారు, గేట్‌వాల్ వంటి మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను కొనసాగించాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందని గ్రామాలలో ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని తెలిపారు. జాబ్ కార్డులు కలిగిన ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. పనులు జరిగే ప్రదేశాలలో కూలీలకు ఎండ దెబ్బ తగులకుండా నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గ్రామాల్లో మ్యాజిక్ సోక్ పిట్స్, సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి విడతగా పైలట్ గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారుల బేసిమెంట్ నిర్మాణాలను పూర్తి చేసి బిల్లులు చెల్లించాలని చెప్పారు. ఇంకా ప్రారంభించని వారు త్వరగా పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, డీపీవో భిక్షపతి, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తున్న స్వాములు

కొండగట్టుకు పాదయాత్ర

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ దీక్షలు స్వీకరించిన భక్తులు మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం నుంచి కొండగట్టు పుణ్యక్షేత్రానికి మంగళవారం పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శిరీష్‌శర్మ స్వాములకు ఇరుముడి కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లిన వారిలో స్వాములు కిరణ్, అంజన్న, ప్రశాంత్, లహంచు, రాజేశ్వర్, బుచ్చయ్య, సుదీకర్, రమేశ్, చిన్ను, రాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వివేక్, శ్రీనివాస్, నారాయణమూర్తి, మధు, రాదాకృష్ణచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర

లక్సెట్టిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం మాలధారులు, భక్తులు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈశోభాయాత్ర ప ట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి అంగడిబజార్ హ నుమాన్ ఆలయం వరకు కొనసాగింది. ఆలయంలో స్వాములకు, భక్తులకు బీజేజీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్న దానం ఏర్పాటు చేసారు. కార్యక్రమంలో స్వాములు ముఖేష్‌గౌడ్, అశ్విన్‌రెడ్డి, వేముల మధు బీజేపీ నాయకులు హరిగోపాల్‌రావు, హేమంత్‌రెడ్డి, బొప్పు కిషన్ పాల్గొన్నారు.



హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

పంటలు ఎండిపోతున్నా పట్టింపు లేదు

జన్నారం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తపాలపూర్, సింగరాయపేట గ్రామాల్లో ఉన్న వరి పంటకు ఆఖరి నీటి తడి అందక పూర్తిస్థాయిలో ఎండిపోతున్నాయి. దీంతో ఆఖరి తడిని పూర్తిస్థాయిలో అందించాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు. మంగళవారం రైతు విజయధర్మ మాట్లాడుతూ కడెం ప్రధాన కెనాల్ కింద సాగయ్యే సింగరాయపేట, తపాలపూర్ గ్రామాలకు యేటా నీరందుతుందన్నారు. కానీ ఈ యేడు ఆయకట్టు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నీటిని సరైన రీతిలో విడుదల చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రెండు గ్రామాల్లో సుమారు వంద నుంచి 200 ఎకరాల్లో వరి పంట ఎండిపోతుందన్నారు. ఇప్పటికైనా అదికారులు కడెం ఇరిగేషన్ అధికారులు స్పందించి నీటిని విడుదల చేయలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగులు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా పంచాయతీ అధికారికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, గ్రీన్ చానల్ ద్వారా 1వ తేదీన వేతనాలు అందజేయాలని కోరారు. సుప్రీం కోర్టు జీవో ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోరేష్, నాగేష్, ప్రకాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కాపువాడలో చోరీ


కాగజ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ కాపువాడలో మంగళవారం ఉదయం చోరీ జరిగినట్టు సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కాపువాడలో నివాసం ఉంటున్న రోజారమణి ఇంట్లోకి పూలు తెప్పుకుంటామని మాస్క్‌ధరించి ఇద్దరు వ్యక్తులు వచ్చారని చెప్పారు. ఆ సమయంలో రోజారమణి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కుని పారి పోయారని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

శునకాన్ని కాపాడిన ఫైర్ అధికారులు

జన్నారం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీనగర్‌లో ఒకరి ఇంట్లో బావిలో పడిపోయిన కుక్కను ఫైర్ అధికారులు కాపాడారు. నగూరి భాగ్యలక్ష్మీ ఇంట్లోని తాగునీటి బావిలో మంగళవారం కు క్క పడిపోయింది. స్థానికు లు ఫైరింజన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ అధికారి శ్రీనివాస్ సిబ్బందితో బావిలో ఉన్న శునకాన్ని కాపాడి బయటకు తీశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వేమనపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కల్మలపేట గ్రామానికి చెందిన ముగ్గురు పేకాట ఆడుతుండగా అరెస్టు చేసినట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 2120 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



చీఫ్ మెడికల్ అధికారిని కలిసిన నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కిరణ్ రాజ్‌ను ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రాంచందర్ మంగళవారం మర్యాదపూర్వకం గా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలోనే సింగరేణి అతి పెద్ద ప్రభుత్వ సంస్థ అని, ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.



కిరణ్‌రాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను నిలదీయాలి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మిక గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రతిపక్ష సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులు యాజమాన్యానికి తొత్తులుగా మారాయని, వారిని కార్మికులు సమస్యలపై నిలదీయాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. మందమర్రిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తింపు సంఘం ఎప్పుడు నెరవేరుస్తుందో చెప్పాలన్నారు. సొంతింటి కళ, ఇన్‌కంటాక్స్ రద్దు, మారుపేర్లు సమస్యను పరిష్క రించకపోవడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, సుదర్శన్, బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రతి ఉద్యోగి ఆరోగ్యాన్ని కాపాడుకో వాలని సింగరేణి ఏరియా వైద్యాధికారి డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే-7 గనిపై మంగళవారం వేసవిలో అనారోగ్యం-నివాణోపాయం అనే అంశంపై అవగాణ సదస్సు నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. తాజాగా దొరికే పండ్ల రసాలు, ద్రవరూపంలో ఆహారం తీసుకోవాలని దీనివల్ల మూత్రపిండాలకు రక్షణ కలుగుతుందని అన్నారు. రక్తపోటు, మధుమేహం, అధిక బరువు ఉన్నవారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి మూత్ర పిండాల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గని మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ, మద్యపానం, మాంసాహారం అతిగా తీసుకోవద్దన్నారు. పండ్లు, కూరగాయలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఆరోగ్యంతో ఉంటనే విధులు సక్రమంగా చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, రక్షణాధికారి సంతోష్ రావు, ఇంజనీర్ ప్రవీణ్, అండర్ మేనేజర్లు రవీందర్, రాము, లక్ష్మీ, సుమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగరేణి ఏరియా వైద్యాధికారి లోక్‌నాథ్‌రెడ్డి



దుస్తులను పరిశీలిస్తున్న సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణి దేవేందర్

వృత్తి శిక్షణ కోర్సులతో మహిళలకు ఉపాధి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వృత్తి శిక్షణ కోర్సులతో మహిళలకు ఉపాది అవకాశాలు లభిస్తాయని సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణిదేవేందర్ అన్నారు. పట్టణంలోని టైలరింగ్ వృత్తి శిక్షణ తరగతుల కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. మహిళలను ఏయే రకాల దుస్తులు కుడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం సింగరేణి సంస్థ యేటా వృత్తి శిక్షణ కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ ఇస్తోందన్నారు. ప్రస్తుతం బ్యూటిషియన్, టైలరింగ్, మగ్గం వర్క్స్, పేపరు బ్యాగుల తయారీ, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. ఈ మూడు నెలలు శిక్షణ పొందిన వారికి రాత పరీక్ష అందించి సర్టిఫికెట్లు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లేడీస్ క్లబ్ మెంబర్లు కవిత, సేవా సమితి కోఆర్డినేటర్ నెల్సన్, నరేష్, టైలరింగ్ శిక్షకురాలు రజిత తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంలు అందుబాటులోకి వచ్చాయి

ఎంఈవో వెంకటేశ్వర స్వామి, కాసిపేట



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : పిల్లలకు ఏకరూపదుస్తులు అందుబాటులోకి వచ్చాయి?

ఎంఈవో : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించేందుకు బట్ట (క్లాత్ మెటీరియల్) గత వారమే ఎంఆర్‌సీకి చేరుకుంది. వాటిని దర్జీలకు ఇచ్చి పాఠశాలల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : విద్యార్థులకు వేసవి సెలవులు ఎప్పటి నుంచి ఉన్నాయి ?

ఎంఈవో : ఈ నెల 24 నుంచి వేసవి సెలవులు ఉంటాయి. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి?

ఆంధ్రజ్యోతి : వార్షిక పరీక్షలు ఎప్పుడు మొదలవుతాయి ?

ఎంఈవో : 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈ నెల 9 నుంచి 17 వరకు వార్షిక పరీక్షలు ఉంటాయి. విద్యార్థులందర్ని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. పరీక్ష పత్రాలను పాఠశాలలకు అందజేశాం.

- కాసిపేట, (ఆంధ్రజ్యోతి)


పెద్దపులి వదంతులను నమ్మవద్దు

కాసిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట మండలంలోని ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలో పెద్దపులి సంచరిస్తుందని సోషల్ మీడియాలో వచ్చిన వదంతులను నమ్మవద్దని ఫారెస్టు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం పలు సోషల్ మీడియాలో పెద్దపులి సంచరిస్తుందనే వీడియోలో వైరల్ అయ్యాయని, కాసిపేట మండలంలో ఎలాంటి పులి సంచరించడం లేదని తెలిపారు. ప్రజలు, రైతులు భయపడవద్దని సూచించారు.

బీజేపీ రివ్యూ సమావేశం

లక్షెట్టిపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణ కేంద్రంలో మంగళవారం బీజేపీ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ హాజరై రానున్న రోజుల్లో పార్టీ దిశా నిర్ధేశంపై చర్చించారు. జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సతీష్‌రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు హరిగోపాల్‌రావు ఉన్నారు.

ఇంటర్ తర్వాత ఎటు?



కోర్సుల ఎంపికే కీలకం

మూడు, నాలుగేళ్లు కష్టపడితే..

జీవితం ఆనందమయం

దండేపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు ముగిసాయి. తరువాత ఏం చదవాలి, ఏరంగంలో స్థిరపడాలనే సందేహాలు విద్యార్థుల మెదడులో మెదులుతూ ఉంటాయి. దీనికి తల్లి దండ్రుల ఒత్తిడి, వివిధ కళాశాల పిఆర్వోల హంగామా తోడైంది. ఇంటర్ తర్వత చదివే కోర్సులే జీవితాన్ని మలుపు తిప్పుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. డాక్టర్, ఇంజనీరింగ్, భావి శాస్త్రవేత, చార్టర్ అకౌంటెంట్, బ్యాంకు ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ కొలువులు ఇలా అనేక అవకాశాలు ఊరిస్తూ ఉంటాయి. దీంతో విద్యార్థి ఊగిసలాడుతూ ఉంటారు. ఇది శ్రేయస్కరం కాదు. నిర్థిష్ట ఆలోచన, విద్యార్థి అభిరుచి, అసక్తే ఇక్కడ కీలకం. విద్యార్థికి ఆసక్తి, అభిరుచి ఉన్న కోర్సు ఎంపిక చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఆవిష్కృతమవుతుంది. ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక కథనం..

డీఎడ్ ప్రాథమిక బోధన..

ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ ఉంటే రెండేళ్ల డీఎడ్ కోర్సులో చేరవచ్చు. జిల్లాలో ఇలాంటి కళాశాలలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. డీఎడ్ కామన్ ఎంట్రన్స్ పరీక్షతో సీటు లభిస్తుంది. అతి త్వరలోనే ఒక ప్రభుత్వ ప్రకటన వెలువడుతుంది.

ఉపాధిలోనూ సేవ చేయాలనుకుంటే...

బైపీసీ విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ ఒక చక్కని అవకాశం. ఉపాధి పొందుతూ పేదలకు సేవ చేసేం దుకు ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంటర్ తర్వాత నాలుగేళ్ల కోర్సును ఎంపిక చేసుకుంటే ఆపై వెంటనే ఉద్యోగం లభిస్తుంది. అలాగే రెండేళ్ల ఫిజియో థెరపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

సీఏ విశ్వవ్యాప్తి ఉపాధి..

దేశ ఆర్థిక వ్యవహారాల్లో పర్యవేక్షణ, నియంత్రికకు సీఏ కోర్సు దోహదపడుతుంది. ఇంటర్ తర్వాత సీపీటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. అర్హత సాధించి ఐసీసీసీలో చేరవచ్చు. నాలుగున్నరేళ్లు చదివితే సమాజంలో ఉన్నత హోదాలో కొనసాగే అవకాశం ఉంటుంది.

ఇంజనీరింగ్ ..

ఎంసెట్‌లో ఇంజనీరింగ్ కోర్సులకు ప్రాధాన్యం అ ధికం. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఐటీ,ఈఈఈ, వంటి కోర్సులు ఉన్నాయి. ఆసక్తి ఉంటే దేంట్లోనైనా రాణించే అవకాశం ఉంటుంది.

వ్యవసాయం ఉద్యానవనం..

ఎంసెట్‌తోనే బీఎస్సీ అగ్రికల్చర్ హార్టికల్చర్(బైపీసీ విద్యార్థులకు) చదివే అవకాశం ఉంటుంది. నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్ ఆపై పీజీ తరువాత పరిశోధన వైపు అడుగులు వేసే సదవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

న్యాయ వృత్తి...

ఇంటర్ తర్వాత ఐదేళ్ల న్యాయ విద్య కోర్సు ఉంది. లాసెట్‌తో ప్రవేశాలు జరుగుతాయి. స్థిరపడేందుకు ఎక్కువ సమయం తీసుకున్న ఉపాధికి మాత్రం బాగుంటుంది. న్యాయవాదిగా వ్యాపార సంస్థలు న్యాయసలహాదారులుగా రాణించవచ్చు.

సంప్రదాయ డిగ్రీ....

బీకాం జనరల్, కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ ఉంది. బీఎస్సీలోనూ అనేక కాంపిటేషన్ కోర్సులున్నాయి. వీటిలో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు.

ఐఐటీ సాంకేతిక విద్యలో మేటీ...

ఇంజనీరింగ్ విద్యపై ఆసక్తి ఉన్నత విద్యా సంస్థల్లో అభ్యసించాలనే వారికి ఐఐటీ ఎంతో ప్రయోజనకరం ఇవి ఆఫర్ చేసే కోర్సుల్లో విద్యార్థులు వారి అభిరుచికి తగినవి ఎంచుకోవాలి. ఏదో ఒకటి అనుకుంటే పొరపాటే.

వైద్యమే ఆరాధ్యమైతే...

వైద్యవృత్తిపై ఆసక్తి ఉంటే ఎంబీబీఎస్ కోర్సు ఉత్తమం. ఎంసెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా కౌన్సిలింగ్‌లో సీటు లభిస్తుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్, వంటి ఉద్యోగాలు పొందవచ్చు. సొంతంగా ఆస్పత్రి ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంబీబీఎస్‌లో సీటు రాకుంటే బీడీఎస్‌లో చేరవచ్చు.

ఫార్మసీ ఎంతో ప్రాధాన్యం....

ఔషధరంగ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. అవకాశాలు విస్తృతంగా ఉంటున్నాయి. ఎంసెట్ తోనే బీ ఫార్మసీ ప్రవేశాలు జరుగుతున్నాయి. ఇది పూర్తి చే సిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ ఆఫీసర్, హాస్పిటల్ ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలు లభిస్తాయి.



- తల్లిదండ్రులు చెప్పారని, స్నేహితులు తీసుకున్నారని ఏ కోర్సులోనూ చేరవద్దు. మార్కెట్లో డిమాండ్ కంటే మనస్సు డిమాండ్‌కే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఆసక్తి ఉన్న కోర్సులో చేరితే జీవితంలో అత్యున్నత స్థాయికి చేరవచ్చు.
- చదువులో ఏదైన పట్టుదల ఉంటేనే అందులో రాణించగలరు. ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసిన వారి లో ప్రతి 100 మందిలో 60 మందికి స్కిల్స్ లేవని కంపెనీలు తిరస్కరిస్తున్నాయి. ఆ జాబితాలో లేకుండా చూసుకోవాలి.
- తల్లిదండ్రులు మార్గ దర్శనం చేయాలి తప్ప నిర్దేశం కాదు ఇష్టమైన కోర్సులో వారిని చేరనీయండి. అందులో రాణించేలా తర్ఫీదు మాత్రమే ఇవ్వండి. ఒత్తిడి తెచ్చి అనర్థాలు కొనితెచ్చుకొవద్దు అంటూ పలువురు సూచిస్తున్నారు.

డబుల్ రోడ్డు నిర్మించాలని రాస్తారోకో

భీమిని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మించాలని కోరుతూ మంగళవారం గ్రామస్థులు ఆర్అండ్‌బీ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూర్ మండలం నుంచి వడాల గ్రామం వరకు 24 కిలోమీటర్ల మేరకు అన్నీ గ్రామాల్లో ఇండ్లను తొలగించి డబుల్ రోడ్డు నిర్మించిన ఆర్అండ్‌బీ అధికారులు భీమిని మండల కేంద్రంలో సింగల్ రోడ్డు పనులు చేపడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగల్ రోడ్డు నిర్మాణం చేస్తుండటంతో రహదారిపై ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని వారు అన్నారు. తాండూర్ మండలంలోని అచ్చలాపూర్, తాండూర్, భీమిని మండలంలోని రాంపూర్, బిట్టూరు పల్లి, వడాల గ్రామాల్లో రెండు పలకల రహదారి ఏర్పాటు చేసి మండల కేంద్రంలో మాత్రం సింగల్ రోడ్డు పనులు చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు నిధులు లేవనే సాకుతో సింగల్ రోడ్డు నిర్మాణం చేస్తూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురుచేస్తున్నారని వారు ఆరోపించారు. అన్నీ గ్రామాల్లో మాదిరిగానే మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చే యనున్నట్లు వారు పేర్కొన్నారు.



భీమినిలో మాట్లాడుతున్న గ్రామస్థులు

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చెన్నూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుద్దాల గ్రామంలో గల రేషన్ దుకాణం వద్ద మంగళవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొని ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నాయకులు బాపు, శంకర్, వెంకటేష్, పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చెన్నూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు శ్రీకిరణ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో చెన్నూరులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం సీఐ దేవేందర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ బండారి లక్ష్మణ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తుడుందెబ్బ మహాసభలను విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

కాసిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12,13,14 తేదీల్లో కొమురం భీంఆసిఫాబాద్ జిల్లా జోడే ఘాట్‌లో నిర్వహించే తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు అన్నారు. మంగళవారం దేవాపూర్‌లో సభల పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. సభలకు ఆదివాసీలు, విద్యావంతులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు సంద్ర భూమన్న, ప్రధాన కార్యదర్శి కుర్సెంగ తిరుపతి, నాయకులు ప్రభాకర్, పవన్, బొజ్జి రావు పాల్గొన్నారు.

తాండూర్ : కెరమెరి మండలం జోడే ఘాట్‌లో జరగనున్న తుడుం దెబ్బ రాష్ట్ర మహాస భల కరపత్రాలను మంగళవారం తాండూర్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు విడుదల చేశారు. తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండిగ రవీందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను పట్టించు కోవడం లేదన్నారు. మండల అధ్యక్షుడు కుర్సెంగ బాపు రావు, మండల ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

జన్నారం : జోడే ఘాట్‌లో నిర్వహించే తుడుందెబ్బ రాష్ట్ర మహా సభల పోస్టర్లను మంగళవారం జన్నారంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు రాయిసిడాం కాళి, సోనేరావు విడుదల చేశారు. నాయకులు నానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో కుమారస్వామి

వేమనపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి సరఫరాపై గ్రామ కార్యదర్శులు దృష్టిపెట్టాలని ఎంపీడీవో కుమారస్వామి సూచించారు. మంగళవారం వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా అన్ని గ్రామాల్లో నీటి సరఫరా అయ్యే విధంగా కార్యదర్శులు పనిచేయాలన్నారు. రాజీవ్ యువ శక్తి పథకానికి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ముమ్మరంగా చేపట్టి కూలీలందరికి పనులు కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు నీడ, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. అంతకుముందు ఎంపీడీవో మండలంలోని కేతనపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న నీటికుంట నిర్మాణ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ మధుకర్, టీఏ కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం అక్షరాస్యత.. సాధించేందుకు కృషి చేయాలి

కాసిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట మండలం వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు అందరు సహకరించాలని ఎంపీవో సప్దర్ ఆలీ అన్నారు. మంగళవారం కాసిపేటలోని అభ్యాసన కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. చదువుకున్న ప్రతి ఒక్కరు మరో ఐదుగురికి అక్షరజ్ఞానం చేయాలన్నారు. మహిళలు కుట్టు శిక్షణ నేర్చుకుని ఆర్థికంగా లబ్ది పొందాలన్నారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ బండ శాంకరి, కృష్ణ గోపాల్, శ్రీధర్, అంగన్‌వాడీ టీచర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు శ్రేయస్కరం

కాసిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్ వైజర్ రాధిక అన్నారు. మంగళవారం బుగ్గగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం ఈ నెల 8 నుంచి 22 వరకు కొనసాగుతాయన్నారు. షెడ్యూలు ప్రకారం ప్రతి రోజూ ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం పిల్లల చేత అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ టీచర్ రాజమణి, పావని, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ఏసీసీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ రమాదేవి గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషణతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు.



పోషణ పక్వాడ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి

అడుగంటుతున్న గొల్లవాగు..

(5వ పేజీ తరువాయి)

నీరు తగ్గిపోయి తూము దిమ్మెలు బయటకు కనిపిస్తున్నాయి. దీం తో రైతులు ఆందోళన చెందుతున్నారు. గొల్లవాగు ప్రాజెక్టు నీటి మట్టం 0.5 టీఎంసీలు కానీ ప్రాజెక్టు ముందు భాగంలో నీరు పూర్తిస్థాయిలో నిలవడం లేదు. దీంతో నీరు ఎక్కువ మొత్తం నిలువకపోవడం రైతులకు శాపంగా మారింది. ఇప్పటికైనా అధికారులు ప్రాజెక్టు ముందు భాగంలో ఎత్తు ఉన్న ప్రాంతాన్ని లోతుగా మార్చితే నీరు భారీగా నిలిచే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

ప్రాజెక్టు పూడిక తీత పనులు చేపట్టాలి

తగరం మల్లయ్య, రైతు

గొల్లవాగు ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి మట్టం తగ్గుతుంది. ఉపాధి హామీపనుల ద్వారా గొల్ల వాగు ప్రాజెక్టులో పూడిక తీత పనులు చేపడితే నీటి సామర్థ్యం పెరిగి రైతుల రెండు పంటలకు సరిపడ నీరందే అవకాశం ఉంటుంది. ఉపాధి హామీ ద్వారా పూడిక తీత చేపడితే కూలీలకు పనులు దొరకడంతో పాటు రైతుల పంటలకు నీరందుతుంది. గొల్లవాగు ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పెంచేలా అధికారులు కృషి చేయాలి.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవో వైద్యులు మూర్తి అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై కాల్‌టెక్స్ ఏరియాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెయింట్‌మేరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణం పరిసరాల శుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత ప్రతి ఒక్కరు పాటిస్తే ఆరోగ్యం జీవించవచ్చు నన్నారు. ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని పేర్కొన్నారు. భోజనం చేసే సమయానికి ముందు చేతులను శుభ్రంగా కడగాలని దీంతో ఎన్నో వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వరుణ్ కుమార్, వైద్య సిబ్బంది శీల, స్టెల్లా, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ తరగతులను విజయవంతం చేయాలి

భీమిని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13 ఆదివారం సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథ రాజకీయ తరగతులను విజయవతం చేయాలని మంగళవారం మండల కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ మాట్లాడుతూ భారతదేశంలో మెజారిటీ ప్రజల మౌలిక సమస్యలను పట్టించుకోని పాలక వర్గ పార్టీలు, సామ్రాజ్యవాదులు, బడా కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేస్తూ, మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఫాసిస్టు అణిచివేత విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక ఉద్యమాలు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథ దేశ వ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ క్రమంలో పార్టీ రాజకీయ తరగతులను నిర్వహించబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు రమాదేవి, సభ్యుడు చింతపురి బాపురావు, సాజిద్, మొండక్క, మీనాక్షి, సారన్న పాల్గొన్నారు.

బాధితుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

వేమనపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకురాలు మర్మల మల్లేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మృతుడు కన్నయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 4న కన్నయ్య తన యాజమాని వేధింపులతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కన్నయ్య మృతికి కారణమైన యాజమాని ఎనగంటి చిన్నన్నరెడ్డి, అతడి భార్య లక్ష్మీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కన్నయ్య మృతిపై స్థానిక ఎమ్మెల్యే వినోద్, అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం మృతుని కుటుబానికి మూడు ఎకరాల భూమి, రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరి, రామయ్య, లక్ష్మీ, రాజన్న, కమల, బుచ్చయ్య, బాయమ్మ, జయ, దుర్గక్క, పోసక్క పాల్గొన్నారు.

మత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

బెల్లంపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మోదీ సర్కార్ మత రాజకీయాలకు తెరలేపుతుందని వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి దేవరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతు కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఉద్యమిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడంతో సరైందికాదన్నారు. కార్మికుల పట్ల, రైతుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ పాలన సాగిస్తుందని మండిపడ్డారు. నాయకులు షాజీద్, రమేష్, శంకర్, దేవరాజు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక హాజీపూర్ మండలం గొల్లపల్లికి చెందిన కంది శృతి(22) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. బాధితుడి తండ్రి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ యేడాది మార్చి 16న సాయికుమార్‌తో శృతికి వివాహం అయింది. వివాహ సమయంలో కట్నం కింద రూ. 5లక్షలతో పాటు మూడున్నర తులాల బంగారం ముట్టజెప్పారు. అయితే పెళ్లైన మూడు రోజుల నుంచే శృతికి అదనపు కట్నం చేవాలంటూ అత్త లక్ష్మి, మామ శంకర్, భర్త వేధింపులు మొదలయ్యాయి. వేధింపులు తట్టుకోలేక శృతి తండ్రి ఈ నెల 7వ తేదీన రూ.50వేలు ముట్టజెప్పాడు. మళ్లీ రెండు లక్షలు కోసం వేధించడంతో భరించలేక సోమవారం రాత్రి శృతి తన తండ్రికి ఫోన్ చేసి విషయం తెలిపింది. మంగళవారం ఉదయం సాయికుమార్ శృతి తండ్రికి ఫోన్ చేసి నీ కూతురు చనిపోయిందని సమాచారం అందించాడు. శృతి కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి అప్పటికే చనిపోయి ఉంది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు అత్త, మామతో పాటు భర్తపై కేసు నమోదు చేశారు.

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలి

మంచిర్యాలక్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పోరాటం కోసం సిద్ధంగా ఉండాలని ఏఐఎఫ్‌టీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో కొనసాగు తున్న ఓసీపీలను మూసి వేయాలని దేశవ్యాప్తంగా 136 బొగ్గు బ్లాక్ వేలం విరమించుకోవాలని, భారత వ్యవసాయ మార్కెట్‌ల విధాన చట్టం విరమించుకోవాలని, బీజేపీ ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. దుండే నర్సయ్య, రాజేశ్వరి, పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలపై అవగాహన

మందమర్రిరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : శంకర్‌పల్లి గ్రామ రైతు వేదికలో మంగళవారం నకిలీ పత్తి విత్తనాలపై అధికారులు అవగాహన కల్పించారు. చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్, తహసీల్దార్ సతీష్‌కుమార్, వ్యవసాయాధికారిణి కిరణ్మయి, ఎస్ఐ రాజశేఖర్‌లు మాట్లాడుతూ నకిలీ పత్తి విత్తనాలు రైతులు వాడవద్దని సూచించారు. నకిలీ విత్తనాలతో పంటలు నష్టపోతారని తెలిపారు. ఏఈవో ముత్యం తిరుపతి, కనకరాజు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
బుధవారం 9 ఏప్రిల్ 2025



'కల్యాణలక్ష్మి' చెక్కులు పంపిణీ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్ కుమార్, ఆర్‌ఐ సిద్ధార్థ్, పట్టణ అధ్యక్షుడు ఆర్మి శివ, మండల అధ్యక్షుడు పుల్ల అశోక్, సీనియర్ అసిస్టెంట్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.


బదిలీపై వెళుతున్న సిబ్బందికి సన్మానం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈసుగాం పోలీస్‌స్టేషన్‌లో పని చేసిన సిబ్బంది బదిలీపై వెళ్లుతున్న సందర్భంతా మంగళవారం ఎస్సై మహేందర్ ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో బదిలి ప్రక్రియ సహజమన్నారు. అంకిత భావంతో పని చేస్తే చక్కటి గుర్తింపు వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కెరమెరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ వాడలో మంగళవారం ఎంపీ గొడెం నగేష్ సౌజన్యంతో సీసీ రోడ్డు పనులను బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 12 వరకు బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థాపన దివస్ కార్యక్రమాలు ప్రతి గ్రామంలో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తుకారాం, శ్రీకాంత్, సోనేరావు, సుభాష్, వినేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌పై బాదుడు



కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరలను పెంచింది. గృహ అవసరాలకు ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరను 50 రూపాయలు పెంచుతున్నట్లు సోమవారం ప్రకటించింది. దీంతో జిల్లా ప్రజలపై భారం పడనుంది.

- గృహవసరాల సిలిండర్‌పై రూ. 50 పెంపు
- జిల్లాలో రూ. 922కు చేరిన ధర
- జిల్లా ప్రజలపై రూ. 40 లక్షల అదనపు భారం

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ వినియోగదారులపై బండబాదుడు మొదలైంది. గృహ వినియోగ సిలిండర్ ధర భారీగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్‌పీజీ ధర పెరగడం ఇతర కారణాలతో ఒక్కో సిలిండర్‌పై 50 రూపాయల వరకు పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో 14.2 కిలోల సిలిండర్ ధర 872 నుంచి 922 రూపా యలకు పెరిగింది. ఈ పెంపు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన ఉజ్వల యోజన లబ్ధిదా రులకు వర్తించనుంది. జిల్లాలో ప్రతి నెలా సరాసరి 1.40 లక్షల సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. ఈ లెక్కన వినియోగదారులపై 40 లక్షల రూపాయల మేర అదనపు భారం పడనుంది.

● గ్యాస్ కనెక్షన్లు ఇలా..

జిల్లాలో 12 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో సుమారు 1.40 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 23,319 దీపం కనెక్షన్లు, 30వేల ఉజ్వల సిలిండర్లు వినియోగిస్తున్నారు. 1.40 లక్షల గ్యాస్ కనెక్షలో సుమారు 60వేలు మహాలక్ష్మి పథకంలో లబ్ధి పొందుతున్నట్లు చెబుతున్నారు. మిగితా 80వేల కనెక్షన్‌పై భారం పడనున్నది. పెంచిన ధరలతో జిల్లా ప్రజలపై ప్రతినెలా సుమారు 40 లక్షల రూపాయల భారం పడనుంది. గత వారంవాణిజ్య అవసరాలకు వినియోగించే సిలిండర్లపై ప్రభుత్వం 41 రూపాయలు తగ్గించింది.

● మూడేళ్లుగా హెచ్చుతగ్గులు..

గ్యాస్ ధరలు మూడేళ్లుగా హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. 2022 మార్చిలో జిల్లా కేంద్రంలో గ్యాస్ సిలిండర్ ధర 875 రూపాయలు ఉండేది. 2023 జనవరిలో 976 రూపాయలకు పెరిగింది. ఏప్రిల్ మరో 50 పెంచడంతో 1,019 రూపాయలకు చేరింది. జూన్‌లో మళ్లీ 50 పెంచడంతో 1,072 రూపాయలకు చేరింది. గత ఆగస్టు వరకు వంటగ్యాస్ ధర 1,172 రూపాయలకు చేరింది.

ఈ క్రమంలో పేదలపై భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌పై 200 రూపాయలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. గతేడాది మార్చిలోనూ మరో 100 రూపాయలు తగ్గించింది. దీంతో ధర 872 రూపాయలకు చేరడంతో వినియోగదా రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం సిలిండర్‌పై 50 పెంచడంతో జిల్లాలో సిలిండర్ ధర 922 రూపా యలకు చేరింది. తాజాగా పెరిగిన ధరలు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ వినియోగదా రులకు సైతం వర్తింప చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

● పేద, మధ్య తరగతిపై..

పెరిగిన వంటగ్యాస్ ధరతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడనుంది. చాలా కాలంగా వంట గ్యాస్ ధరలను కేంద్రం, కంపెనీలు పెంచలేదు. వాణిజ్య గ్యాస్ ధరలను మాత్రం పెంచుతూ తగ్గిస్తూ వస్తోంది. ఇప్పటికే పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో ఇబ్బంది పడుతున్న పేద మధ్య తరగతి ప్రజలకు తాజాగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల ధర పెంపుతో మరింత భారం పడనుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం 500 రూపాయలకే సిలిండర్ ఇస్తుండగా ప్రస్తుతం పెరిగిన ధరలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనుంది. ఈ పథకం కింద ఇప్పటి వరకు గ్యాస్ సిలిండర్‌ను పూర్తి ధర చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం ప్రభుత్వం జమ చేస్తున్నది.

ఆర్థికంగా భారం..

- జ్యోతి, గృహిణి, ఆసిఫాబాద్



గ్యాస్ ధరలు ప్రభుత్వం పెంచడంతో పేద మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా భారం పడ నుంది. గృహవసరాల సిలిండర్‌పై 50 రూపాయలు పెంచ డంతో భారం కానుంది. ఇప్పటికే నిత్యా వసర ధరలు పెరిగి పోతున్నాయి. మళ్లీ గ్యాస్ ధర పెరగడంతో సామాన్య ప్రజలకు ప్రతినెల ఖర్చు లు పెరిగిపోతున్నా యి. ప్రభుత్వం నిరుపేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని గ్యాస్ ధరను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే చట్ట ప్రకరారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే అన్నారు. ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలో ఈ నెల 9న ఓ మైనర్‌కు వివాహం చేసేందుకు నిశ్చయించారన్న సమాచారం మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేతో కలిసి మంగళవారం అడ్డుకున్నారు. బంధువులు, కుటుంబ సభ్యులు, కుల పెద్దలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాలికను తాత్కాలిక వసతి నిమిత్తం జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్ తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇరువైపులా కుటుంబ సభ్యులు, పురోహితుల పైన నాన్ బెయిల బుల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. రెండు సంవత్సరాల జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల జరిమానా ఉంటుందని తెలిపారు. బాలికల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 18 సంవత్సరాలు నిండే వరకు చదివించి తరువాతనే వివాహం చేయాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే 1098కు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహనాలు చేయడం వల్ల అమ్మాయిల్లో అనారోగ్య సమస్యలు తలెత్తి భవిష్యత్తులో ఇబ్బందులు పడే అవకాశం ఉందని చెప్పారు. తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ బాల ప్రవీణ్‌కుమార్, సూపర్‌వైజర్ లైలా, కౌన్సిలర్ చంద్రశేఖర్, రవళి, కానిస్టేబుల్ పండిత్ పాల్గొన్నారు.

ఎస్పీఎం కార్మికులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం కార్మికులకు పార్టీ ఉంటుందని, ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బరిలో ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీఎం మిల్లు 2014లో మూత పడితే అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018లో రాయితీలిచ్చి పునరుద్ధరించిందన్నారు. ఉత్పత్తి కూడా 90 శాతం ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించిందన్నారు. మిల్లు పునరుద్ధరణ అనంతరం ఈ ప్రాంత కార్మికులను పూర్తి స్థాయిలో విధుల్లోకి తీసుకోలేదన్నారు. అలాగే ఈ ప్రాంత కార్మికులకు జీత భత్యాలు కేవలం రూ.20వేలు ఉండగా, స్థానికేతరులు, ఇతర రాష్ట్రాల వారికి మాత్రం రూ.30 నుంచి లక్ష వరకు ఇస్తున్నారని అన్నారు. మిల్లులో ఒకే పని చేస్తుండగా వేర్వేరు జీతాలివ్వడం సరికాదని తెలిపారు. ఇలా స్థానికులకు అన్యాయం చేయడాన్ని తాము ఖండిస్తున్నామని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ సిర్పూరునియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావుతో పాటు మోహిన్, ట్రేడ్ యూనియన్ నాయకులు అంబాల ఓదెలు, గోగర్ల కన్నయ్య, సీపీ రాజ్‌కుమార్, రాగులయ్య, మినాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను విస్మరిస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం సాధించిన మహనీయులను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జై బాపు, జై భీం, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధవిహార్‌లో పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ పట్టణ పలు వీధుల గుండా సాగింది. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహనీయులను విస్మరిస్తోందన్నారు. ప్రధానంగా గాంధీ సాధించిన సేవలను పట్టించుకోవడం లేదన్నారు. ఇతర దేశాల్లో గాంధీ పుట్టిన రోజు సందర్భంగా గుర్తింపు పొందే కార్యక్రమాలు చేపడుతుండగా మన దేశంలో మాత్రం విలువ ఇవ్వకుండా చేస్తున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా బీజేపీ నాయకులు అవమాన పరిచారని అన్నారు. స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయులను గుర్తు చేస్తూ, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లోకి అవగాహనపరిచేందుకు జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొక్కిల విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రజలే బీజేపీకి బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగీర్‌తో పాటు మాజీకౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీఐ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సోమవారం రాత్రి ఇట్యాల, రాళ్లగూడెం గ్రామాల్లో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ప్రజాపాలన సేవా కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి మంగళవారం సందర్శించారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఆర్థిక చేయూత అందించే అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర ఆర్థిక వెనకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగ యువత మీ- సేవ కేంద్రాల ద్వారా చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాపాలన సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో వచ్చిన దరఖాస్తులను ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియ పరిశీలించి పథకం నిర్వహణపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈడీ సజీవన్, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీఓ శ్రీనివాస్, ఈ-డిస్ట్రిక్ మేనేజర్ గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీఆర్ డిపోలో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి రేషన్ కార్డుదారుడు సన్న బియ్యం తీసుకోవాలని తెలిపారు. నాణ్యతతో కూడిన సన్న బియ్యంను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని చెప్పారు. రేషన్‌డీలర్లు సక్ర మంగా కార్డుదారులకు బియ్యం అందజేయాలని సూచించారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణ చర్యలను పరిశీలించారు. వేసవి కాలం అయినందున మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులు, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

యువత క్రీడల్లో రాణించాలి

వాంకిడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో యువత రాణించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని డైలీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాంకిడి ప్రీమియం లీగ్ సీజన్-3 క్రికెట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయని చెప్పారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికి తీసేందుకు ఎంతో దోహ దపడుతాయని అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, నాయకులు తుకారాం, అయూబ్, జగదీష్, విలాస్, అవినాష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



దహెగాంలో చెక్కులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

దహెగాం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం కుంచవెల్లి, కమ్మర్‌పల్లి, గిరివెల్లి, అయినం గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు మంగళవారం సీఎం సహాయ నిధి నుంచి మంజూరు అయిన చెక్కులను బీజేపీ నాయకులు కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, నాయకులు దామోదర్ గౌడ్, దామోదర్, బాలాజీ, భీమన్న, సాయికృష్ణ, సుధాకర్, శంకర్, సత్యనారాయణ, విజయ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను బీజేపీ నాయకులు అందజేశారు. పెద్దసిద్దాపూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, శ్రీనివాస్, లంబాడిగూడ గ్రామానికి చెందిన విలాస్, శారద, బొగుడగూడ గ్రామానికి చెందిన విజయ్‌కుమార్, బారెగూడ గ్రామానికి చెందిన శారద, గురునాథం, ముంజంపల్లికి చెందిన స్నేహ, పాపనపేటకు చెందిన సంతోష్‌లకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీజేపీ నాయకులు అందేశారు. కార్యక్రమంలో తిరుపతి, మల్లయ్య, తిరుపతి, భిక్షపతి, రామయ్య, వసివుల్లాఖాన్, బాలకృష్ణ, తిరుపతి, దిలీప్‌కుమార్, కిష్టయ్య, తిరుపతిగౌడ్, మహేష్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మూగరోదన పట్టదా?

- యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా
- రాత్రి వేళ తరలిస్తున్న వ్యాపారులు



రెబ్బెనలో పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు(ఫైల్)

కాగజ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర కేంద్రంగా పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. మహారాష్ట్ర నుంచి నేరుగా సిర్పూరు(టి), కాగజ్‌నగర్ మీదుగా పశువులను రాత్రి వేళల్లో వివిధ వాహనాల్లో తరలిస్తున్నారు. ఎలాంటి రశీదులు లేకున్నా రాత్రి వేళల్లో ఈ దందాపై నిఘా పెట్టరన్న ఉద్దేశ్యంతో ఇష్టారాజ్యంగా హైదరాబాద్ కబేళాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కనీసం పశువులను తరలించాలంటే పాటించాల్సిన నిబంధనలనూ బేఖాతరు చేస్తున్నారు. కనీసం ఆరు గంటల ప్రయాణం చేసే దూరాని ఈ పశువులను తరలించవచ్చా..? లేదా అనే వెటర్నరి వైద్యుడి ధ్రువీకరణ, రహదారి పత్రం, ప్రతి వాహనం లో గ్రాసం, తాగునీరు, పశువులను తరలించేందుకు అనువైనా స్థలం ఉంటేనే తరలించాల్సి ఉంటుంది. కానీ ఇవేమి పట్టించుకోవం లేదు. మహారాష్ట్ర కేంద్రంగా తరలిస్తున్న పశువులు దారి మధ్యలోనే పశువులు చనిపోతుంటే మార్గ మధ్యలోనే పడేసి పోతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌటాల మండల కేంద్రం నుంచి కూడా ఇదే తరహాలో పశువులను తరలిస్తున్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఈ దందాను అరికట్టేందుకు గట్టి నిఘా పెట్టిన కూడా అక్రమా ర్కులు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారని చెబుతున్నారు. రెండు రోజుల క్రితం కూడా కాగజ్‌నగర్ డాడానగర్ చౌరస్తాలో కౌటాల నుంచి హైదరాబాద్‌కు 13 వాహనాల్లో తరలిస్తున్న 26 పశువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 13 మంది డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. మహారాష్ట్ర మీదుగా వయా ఆసిఫాబాద్ మీదుగా కూడా ఇదే తరహాలో పశువుల అక్రమ రవాణా చేస్తున్నారు. రాత్రి వేళల్లోనే ఈ దందాను కొనసాగించి లక్షలు అర్జిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేసినా పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. ఇప్పటికైనా జిల్లా పోలీసు యంత్రాంగం ఈ దందాపై నిఘా పెట్టి పూర్తి స్థాయిలో అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల తనిఖీ

కౌటాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగడ్‌దగడ్ ప్రాథమికోన్నత, బాలెపల్లి ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఎంఈవో హనుమంత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ తప్పని సరిగా పాటించాలని ప్రధానోపాధ్యా యులకు సూచించారు. వారంలో మూడు రోజులు గుడ్లు అందించాలన్నారు. నిర్లక్ష్యం చేసినట్లయితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 11 నుంచి నిర్వహించే వార్షిక పరీక్షలు విద్యార్థులు ప్రశాంతంగా రాసేలా చూడాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమకారుడికి ఘన నివాళి

రెబ్బెన, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, అమర వీరుడు వేణుకుమార్‌గౌడ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంమోహన్‌రావు, ఎస్సై చంద్రశేఖర్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఉపేందర్, మాజీ జడ్పీటీసీ సంతోష్, మధునయ్య, శంకరమ్మ, శ్రీధర్ పాల్గొన్నారు.